సాక్షి సంగారెడ్డి

శనివారం । 11 । అక్టోబర్ । 2025



మెడికల్ మాయ

జనరిక్ ఔషధాలను అధిక ధరలకు విక్రయించడంతోపాటు ఫార్మా సంస్థలిచ్చే శాంపిళ్లను అమ్మేస్తున్నారు. వివరాలు 8లో ▸



ఆలయంలో చోరీ

జహీరాబాద్‌లోని తుల్జాభవానీ ఆలయంలో దొంగలు పడి అమ్మవారి ఆభరణాలు, డబ్బులు ఎత్తుకెళ్లారు. వివరాలు 8లో ▸



నిరుపయోగంగా..

జహీరాబాద్‌లోని ప్రాంతీయ ఆస్పత్రి సిబ్బందికి కేటాయించిన నివాస భవనాలు నిరుపయోగంగా మారాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రేపటి నుంచి పల్స్ పోలియో

పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న నేత్రావతి

పటాన్‌చెరు టౌన్: పోలియో మహమ్మారిని శాశ్వతంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగంగా పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈనెల 12 నుంచి 14వరకు చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందు కోసం 12న అన్ని ప్రభుత్వ, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సహా వాటి పరిధిలోని బూత్‌లలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు చిన్నారులకు చుక్కల మందు వేయనున్నారు. 13, 14 వ తేదీల్లో ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పటాన్‌చెరు పరిధిలోని 6602 మంది చిన్నారులకు పల్స్ పోలియో వేయనున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని యూపీహెచ్‌ఎస్సీ పటాన్‌చెరు వైద్యాధికారి నేత్రావతి తెలిపారు.

మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే

మున్సిఫ్‌కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్



ప్రసంగిస్తున్న మేజిస్ట్రేట్ మహ్మద్ అసదుల్లా షరీఫ్

జోగిపేట(అందోల్): శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని జోగిపేట మున్సిఫ్‌కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ పేర్కొన్నారు. ఒత్తిడి, ఆందోళన వంటివి సర్వసాధారణమని, వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలుసుకోవడం అవసరమన్నారు. 'వరల్డ్ మెంటల్ హెల్త్ డే'పురస్కరించుకుని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ అందోలు బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాల్యం వయసులోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పట్టుదలతో చదివి లక్ష్య సాధనతో అంకితభావంతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

ఐకేపీ వీవోఏల జిల్లా నూతన కార్యవర్గం



ఎన్నికైన వీవోఏల నూతన కార్యవర్గం

వట్‌పల్లి(అందోల్): ఐకేపీ వీవోఏల జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా మండలాలకు చెందిన వీవోఏలు సమావేశమై జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.నాగేష్ ప్రధానకార్యదర్శిగా ఆర్.అంజనేయులు, ఉపాధ్యక్షులుగా కిష్టయ్య, ప్రవీణ్, మల్లయ్య,కోశాధికారిగా భాగ్యలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మారెడ్డి, సహాయ కార్యదర్శులుగా విజయలక్ష్మి, ఉమ, నరేందర్‌గౌడ్, నాగరాజు,ముస్తఫా, గౌరవ అధ్యక్షులుగా సాయిలు, విద్యాసాగర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

త్వరలో చెక్ పోస్టు ఏర్పాటు

రాయికోడ్ (అందోల్): రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చింనాపూర్ శివారులో త్వరలో చెక్ పోస్టు ఏర్పాటు చేయనున్నట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి శ్రీనివాస్ వెల్లడించారు. రాయికోడ్ మునిపల్లి మండలాల్లో 5 జిన్నింగ్ మిల్లులున్నాయన్నారు. ఈ ఏడాది రూ.3.70 కోట్ల ఆదాయం సమకూర్చేందుకు లక్ష్యంగా నిర్ణయించమన్నారు. పత్తి రైతులు విధిగా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి కపాస్ కిసాన్ యాప్లో పంట నమోదు చేసుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరా అంతరాయం

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట్, సుల్తాన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఏఈ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కిష్టారెడ్డిపేట సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు, సుల్తాన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అలా ఎలా లెక్కిస్తారు?

ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టులో భూ నిర్వాసితుల ఆందోళన

- మున్సిపాలిటీ పరిధిలో భూములకు గ్రామీణ ప్రాంత రేట్లతో పరిహారం
- తీవ్రంగా నష్టపోతామంటున్న చింతలపల్లి నిర్వాసితులు
- ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అధికారులు చేసిన తప్పిదాల కారణంగా రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ రహదారి నిర్మాణంలో సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న చింతలపల్లి ప్రాంతం భూములు కోల్పోతున్నారు. అయితే ఈ భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించే పరిహారం విషయంలో తమకు అన్యాయం జరుగుతోందని నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూములకు మున్సిపాలిటీ ధరల ప్రకారం లెక్కించి పరిహారం చెల్లించాల్సి ఉండగా, రెవెన్యూ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే భూముల ధరలతో లెక్కించి పరిహారం చెల్లించాలని చూస్తున్నారని ఈ నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చింతలపల్లి గ్రామం 2018లోనే సంగారెడ్డి మున్సిపాలిటీలో విలీనమైందని చెబుతున్నారు. అయితే రీజనల్ రింగ్ రోడ్డు ప్రతిపాదన 2020 తర్వాత తెరపైకి వచ్చింది. కానీ పరిహారం చెల్లింపు విషయానికి వస్తే ఈ గ్రామాన్ని గ్రామ పంచాయతీలో ఉండే భూముల ధరలతో ఎలా లెక్కిస్తారని ప్రశ్నిస్తున్నారు. తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న తమ భూములను లాక్కోవద్దని ఈ నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా పరిహారం చెల్లింపుల్లోనూ అధికారులు అన్యాయం చేస్తున్నారని, తమకు మార్కెట్ రేటు ప్రకారం తగిన పరిహారం చెల్లించకపోతే భూములు ఇచ్చేది లేదని తేల్చి చెబుతున్నారు.

నేతల చుట్టూ రైతులు

తమ సమస్యను పరిష్కరించాలని పలువురు నిర్వాసిత రైతులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ అధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని తమ సమస్యను పరిష్కరించాలని ఇటీవల టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అలాగే ఎంపీ రఘునందర్‌రావుకు కూడా వినతిపత్రం అందజేయాలని ఈ నిర్వాసిత రైతులు నిర్ణయించారు. తమకు తగిన పరిహారం అందించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

13 గ్రామాల్లో నిర్వాసితులు

రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో సంగారెడ్డి జిల్లాలో మూడు మండలాల్లోని 13 గ్రామాల పరిధిలో రైతులు భూములు కోల్పోతున్నారు. సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్, హత్నూర మండలాల పరిధిలో ఈ గ్రామాలున్నాయి. ఇందులో చింతలపల్లి కూడా ఒకటి. రెవెన్యూ అధికారులు ఈ రైతులకు పరిహారం చెల్లించేందుకు ఇప్పటికే 24 డ్రాఫ్ట్ అవార్డును ప్రకటించారు. ఈ క్రమంలో చింతలపల్లి నిర్వాసితులకు గ్రామీణ ప్రాంత రేట్లతో పరిహారం చెల్లించేలా అవార్డు ఇచ్చారని నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందంటున్నారు.

భగీరథ నీళ్లు బంద్

- పైప్‌లైన్ పగిలిపోవడంతో పదిరోజులుగా నిలిచిన నీటి సరఫరా
- దాహార్తిలో ఆరు మండలాల్లోని 449 గ్రామాలు
- మరమ్మతులకు మరో పది రోజులు పట్టవచ్చంటున్న అధికారులు
- గ్రామాలలో ఉన్న రక్షిత మంచినీటి బోర్లను పునరుద్ధరించని వైనం



హత్నూర మండలం దౌల్తాబాద్‌లో నీటి ట్యాంకర్ వద్ద నీళ్ల కోసం జనం పాట్లు



జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజిరెడ్డి

హత్నూర(సంగారెడ్డి)/: పుల్కల్ మండలం వెండికొలు గ్రామ శివారులో పదిరోజుల క్రితం మంజీరా నది నీటిలో పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో హత్నూర, జిన్నారం, గుమ్మడిదలతోపాటు మెదక్ జిల్లా నర్సాపూర్, శివంపేట కౌడిపల్లి ఆరు మండలాల్లో 449 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామాల్లో ఉండే రక్షిత మంచినీటి బోర్లను కనీసం మరమ్మతులు చేయకపోవడంతో నీళ్లలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నీటి సరఫరా చేసే బోర్లున్నప్పటికీ వాటికి మోటార్లు లేకపోవడం, మరమ్మతులు చేయించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజలు నీటి కోసం వ్యవసాయ బోరు బావులను ఆశ్రయిస్తున్నారు. నర్సాపూర్, దౌల్తాబాద్, పట్టణాలలో కొంతమంది నాయకులు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజలకు సరిపోవడం లేదు. పైప్‌లైన్ మరమ్మతులు చేసేంతవరకైనా తాగునీటికి కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లైనా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలని వినతి

తాగు నీటి సమస్యను పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌ను నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం మంత్రిని కలిసి నియోజకవర్గంలో నీటి సమస్యను వివరించారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు గోదావరి జలాలను కోమటిబండ నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా శివ్వంపేటలోని సంప్‌కు మళ్లించి నియోజకవర్గ ప్రజలకు నీటి సరఫరా చేపట్టాలని కోరారు.

నీళ్లు రాక ఇబ్బందులు



కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. బోరు బావుల నుంచి రోజు తెచ్చుకుంటున్నాం. వెంటనే మిషన్ భగీరథ నీళ్లు వచ్చేలా అధికారులు మరమ్మతులు చేయాలి.

– రమావత్ మాలి

తగ్గుముఖం పడితేనే..

పైపులైన్ పగిలిపోవడంతో గ్రామాలకు గత పది రోజులుగా నీరు రావడం లేదు. మంజీరాలో నీళ్లు తగ్గితే పైపులైన్‌కు మరమ్మతు చేయడానికి వీలవుతుంది. ప్రజలు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం.

– రఘువీర్, జిల్లా మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్

బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాల్సిందే



ఆందోళన చేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నేతలు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్

సంగారెడ్డి: బీసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్ హెచ్చరించారు. వైఎస్సార్ భవన్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ప్రభుగౌడ్ పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లపై హైకోర్టుకు వెళ్లిన వారు తిరిగి పునరాలోచన చేసి కేసు వాపసు తీసుకోవాలని హితవు పలికారు. బీసీల మీద రాజకీయాలు చేయకుండా బీజేపీ న్యాయం చేయాలన్నారు. హైకోర్టు తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలని కోరారు.

బీసీ విద్యార్థి సంఘాల నిరసన

బీసీ రిజర్వేషన్ల విషయమై సంగారెడ్డిలో బీసీ విద్యార్థి సంఘాలు శుక్రవారం ధర్నా నిర్వహించాయి. స్థానిక బస్టాండ్ ముందు బైఠాయించారు. బీసీలకు 42% రిజర్వేషన్లను అగ్రవర్ణాల వారు అడ్డుకున్నారని పలువురు బీసీ సంఘాల నాయకులు విమర్శించారు. రాజ్యాధికారం అగ్రవర్ణాల చేతిలో ఉన్నంత కాలం బహుజనులు బానిసలుగానే ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోకుల్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల మల్లికార్జున పాటిల్, ముఖ్య సలహాదారులు చంద్రయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

సరైన నష్టపరిహారం అందించండి

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



కంది(సంగారెడ్డి): ఖేల్ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు జాతీయ రహదారి –165 విస్తరణలో భాగంగా భూములు, స్థలాలు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం అందేలా చూడాలని అధికారులకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. మండల కేంద్రమైన కందిలో జాతీయ రహదారి విస్తరణలో భూములు స్థలాలు కోల్పోతున్న బాధితులు, అధికారులతో శుక్రవారం జగ్గారెడ్డి సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులు నష్టపోకుండా సర్వేచేసి కలెక్టర్‌కు నివేదిక పరిహారం అందేలా చూడాలన్నారు. స్థలాలు కోల్పోతున్న వారు మాట్లాడుతూ..రోడ్డు విస్తరణ అధికంగా చేయడం వల్ల తమ ఇళ్లను కోల్పోవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి జగ్గారెడ్డి స్పందిస్తూ...ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నష్టపరిహారం విషయంలో అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నేషనల్ హైవే డీఈ రామకృష్ణ, తహసీల్దార్ రవికుమార్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రఘు గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మోతిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత పాఠ్యపుస్తకాలు పంపిణీ

- జిల్లాకు చేరుకున్న పుస్తకాలు
- వీటితోపాటు డిజిటల్ బుక్స్ అందజేత



జహీరాబాద్ మండల విద్యాధికారి కార్యాలయానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలు

జహీరాబాద్ టౌన్: ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం రోజు నుంచే ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు అందించడం ప్రారంభించారు. పార్ట్–1 సిలబస్ పూర్తి కావస్తుండగా రెండో విడత పార్ట్–2 పుస్తకాల పంపిణీకి అధికారులు సిద్ధం చేశారు. ఇటీవలే మండల కేంద్రాలకు పుస్తకాలు సరఫరా అయ్యాయి. మండల విద్యాధికారి కార్యాలయం నుంచి పాఠశాల సిబ్బంది బడులకు చేరవేస్తున్నారు. గతేడాది పంపిణీలో ఆలస్యం కావడంతో ఈ సంవత్సరం జాప్యాన్ని నివారించేందుకు అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

జిల్లాకు 80%వరకు చేరిన పుస్తకాలు

పార్ట్–2 పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందించాల్సి ఉండగా జిల్లాకు 80% రెండవ విడత పుస్తకాలు వచ్చాయి. వీటిని జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. పాఠశాలలకు సులువుగా పంపిణీ చేసేందుకు సబ్జెక్టులు, తరగతుల వారీగా పుస్తకాలను విభజించారు. పార్ట్–2 పుస్తకాలను విద్యార్థులకు 15 రోజుల క్రితమే పంపిణీ చేయాల్సి ఉండగా దసరా సెలవులు రావడంతో వాయిదా వేశారు. సెలవులు ముగియడంతో పుస్తకాల పంపిణీని ప్రారంభించారు.

డిజిటల్ బుక్స్ కూడా..

జిల్లావ్యాప్తంగా 4,31,872 పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరవేశారు. వీటితో పాటు డిజిటల్ బోధన అందించేందుకు 6,7,8,9 తరగతి విద్యార్థులకు మరో 1,07,968 పుస్తకాలు వచ్చాయి. పార్ట్–2 పుస్తకాలతో పాటు డిజిటల్ బుక్స్ కూడా విద్యార్థులకు అందజేయనున్నారు. నోట్‌బుక్స్, తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలను జూన్‌లో పార్ట్–1 పుస్తకాలతో పాటు అందజేశారు. ప్రస్తుతం సబ్జెక్ట్ బుక్స్ మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

బీజేపీ ఓట్ల చోరీని గ్రామాల్లో వివరించండి

సంతకాల సేకరణ ప్రారంభించిన ఎమ్మెల్యే



సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: బీజేపీ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నికల సంఘం అధికారులతో కుమ్మక్కై ఓట్ల చోరీతో చేస్తున్న మోసాలను కాంగ్రెస్ శ్రేణులు గ్రామాలకు తీసుకెళ్లి ప్రజల్ని చైతన్య పరచాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. ఖేడ్‌లోని తన నివాస గృహం ఆవరణలో శుక్రవారం సంతకం చేసి ఓట్ల చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న చోట్ల బీజేపీ ఓట్ల చోరీతో అధికారంలోకి వస్తోందన్నారు. కర్ణాటకలో ఒకే ఇంట్లో 80 నకిలీ ఓట్లను తయారు చేయగా దేశంలో మొత్తంలో ఇలాంటి మోసాలకు బీజేపీ పాల్పడిందని ఆరోపించారు. పదేళ్ల కిందట రాష్ట్రంలోని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం ఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు సంబంధించిన 10 వేల ఓట్లను తొలగించి, అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఉప ఎన్నికల్లో లబ్ధి పొందిందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేశ్‌చౌహాన్, పండరీరెడ్డి, దారం శంకర్, తాహెర్, ముంతాజ్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో లీగల్ ఎయిడ్ క్లినిక్స్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



సమావేశంలో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి: లీగల్ ఎయిడ్ క్లినిక్స్ ద్వారా సమాజంలోని ప్రతి వ్యక్తికి న్యాయసేవలను అందించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర ఆదేశాల మేరకు సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడంలో భాగంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ–అడిక్షన్ / రిహాబిలిటేషన్ సెంటర్ వద్ద లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను శుక్రవారం సౌజన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు,పునరావాసం పొందుతున్న రోగులకు న్యాయసంబంధిత సలహాలు, మార్గదర్శకత్వం, అవసరమైతే ఉచిత న్యాయ సహాయం అందజేస్తారన్నారు. కుటుంబ, ఆస్తి, ఉద్యోగం, గృహహింస, పునరావాసానికి సంబంధించిన చట్టపరమైన సమస్యల పరిష్కారం కోసం ఈ క్లినిక్ ద్వారా సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ప్రతీ శనివారం ఒక ప్యానల్ లాయర్, ఒక పారా లీగల్ వలంటీర్‌ను విధులకు వస్తారని వెల్లడించారు. ఈ సేవలు పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ అధికారి నాగనిర్మల, డా.శశాంక్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ, బాలస్వామి, అడ్వొకేట్ ఖాలేద్ , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కమతాల్లోనే కల్లాలు

- నిర్మాణాలకు కేంద్రం సుముఖం
- రైతులకు భారీ ప్రయోజనం
- రోడ్లపై పంటలు ఆరబెట్టే బెడదకు ఫుల్‌స్టాప్



నారాయణఖేడ్: పండించిన పంటల రైతులు ఆరబెట్టేందుకు కల్లాల సదుపాయం లేక రోడ్లపై పంటలను ఆరబెట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది రైతులు కొనుగోలు కేంద్రాలకు తమ పంట ఉత్పత్తులను ఆరబెట్టకుండానే తీసుకొస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలన్నింటినీ నివారిస్తూ రైతులకు వెసులుబాటు కల్పించేందుకు కేంద్రం కల్లాల నిర్మాణాలకు సూత్రపాయంగా అంగీకరించింది. ఉపాధిహామీ పథకంలో కల్లాల నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఇస్తామని పేర్కొంది. కల్లాల ఏర్పాటుతో రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది. 2021– 22లో కల్లాల నిర్మాణాలు ఉపాధి హామీ పథకంలో అప్పట్లో చేపట్టారు. అయితే కేంద్రం అనుమతి లేకుండా నిర్మించారని వాటిని మధ్యలో నిలిపివేశారు. అప్పట్లో 50, 60, 75 చదరపు మీటర్ల చొప్పున మూడు రకాలుగా కల్లాలను నిర్మించారు. 50 చదరపు మీటర్ల కల్లానికి రూ.50 వేలు, 60కు రూ.62వేలు, 75 చదరపు మీటర్లకు రూ.78వేల వరకు చెల్లించారు. కొంత మొత్తం కూలీ కింద చెల్లింపులు జరగగా మెజార్టీ డబ్బులు మేటీరియల్ కాంపోనెంట్ కింద అందజేశారు. అప్పట్లో రైతులు కల్లాల నిర్మాణాలకు ముందుకు వచ్చారు. మధ్యలో నిలిచిపోవడంతో పథకం అప్పటినుంచి కొనసాగలేదు.

కల్లాల నిర్మాణాలకు కేంద్రం చర్యలు

జిల్లాలో సుమారు 70వేల జాబ్ కార్డులు ఉండగా 2,11,054మంది కూలీలు పనులు చేస్తున్నారు. సీసీఐ పత్తి కొనుగోళ్ల అంశం, రైతులు పత్తి పంటను ఆరబెట్టకుండానే తెస్తున్నారనే అంశాలపై కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో జరిగిన చర్చ సందర్భంగా ప్రస్తావన రావడంతో ఉపాధి హామీలో కల్లాల నిర్మాణాలకు అనుమతిస్తామని మంత్రి గిరిరాజ్‌సింగ్ వెల్లడించారు. ప్రతీ పంచాయతీలోనూ కల్లాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలని సూచించడంతో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కల్లాల నిర్మాణంపై దృష్టి సారించింది. రైతుల అవసరం మేర కల్లాలను నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు



కల్లాల నిర్మాణంపై మార్గదర్శకాల కనుగుణంగా చర్యలు చేపడతాం. అవసరమైన ప్రతిపాదనలు పంపిస్తాం. గతంలో కల్లాల నిర్మాణం చేపట్టినా మధ్యలో నిలిచిపోయింది. ప్రస్తుతం వచ్చే మార్గదర్శకాల మేరకు తగు చర్యలు తీసుకుంటాం. కల్లాల నిర్మాణంతో రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– బాల్‌రాజ్, అదనపు పీడీ, డీఆర్‌డీఏ, సంగారెడ్డి

క్లుప్తంగా

సేవా రంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ మహేందర్

హవేళిఘణాపూర్(మెదక్): యువత సమాజానికి ఉపయోగపడే సేవా రంగంలో ముందుండాలని ఏఎస్పీ మహేందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముత్తాయికోట గ్రామంలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువకులు బాగా చదువుకొని ఉద్యోగాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్య కేసులో మహిళకు జీవిత ఖైదు

హవేళిఘణాపూర్(మెదక్): భర్తను హత్య చేసిన ఘటనలో దోషిగా తేలడంతో కోర్టు మహిళకు జీవితఖైదు, జరిమాన విధించింది. ఎస్ఐ నరేశ్ వివరాల ప్రకారం... మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన సంగపొల్ల మల్లయ్య గతంలో దుబాయ్‌కు వెళ్లి మూడేళ్ల పాటు పని చేసి ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో మల్లయ్య భార్య లక్ష్మి అదే గ్రామానికి చెందిన జాల రాందాస్‌తో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో పలుమార్లు గొడవలు అయ్యాయి. ఈ విషయంలో భర్త అడ్డొస్తున్నాడని భార్య అతడ్ని హత్య చేసింది. 2020లో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితురాలికి జీవితఖైదు విధించి రూ.5వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.

కోతుల దాడిలో వృద్ధుడికి గాయాలు

మద్దూరు(హుస్నాబాద్): వృద్ధుడిపై కోతులు దాడి చేశాయి. ఈ ఘటన దూల్మిట్ట మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తుషాలపురం మల్లయ్య(70) సాయంత్రం ఇంటి నుంచి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో కోతుల గుంపు ఒక్కసారిగా అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచా యి. గమనించిన స్థానికులు కర్రలతో కోతులను తరిమారు. గాయపడిన వృద్ధుడిని నంగునూరు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

ఒకరికి గాయాలు

కొమురవెల్లి(సిద్దిపేట): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చేసకుంది. ఎస్ఐ రాజు వివరాల ప్రకారం... నంగునూర్ మండలంలోని వెంకటపూర్ గ్రామానికి చెందిన గుండెల్లి ప్రశాంత్ మార్కెటింగ్ చేస్తున్నాడు. విధుల్లో భాగంగా ద్విచక్రవాహనంపై చేర్యాలకు వచ్చే క్రమంలో గుర్జకుంట క్రాస్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో వేచరేణి గ్రామానికి చెందిన మ్యాక అరుణ్ తన ద్విచక్రవాహనంతో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ప్రశాంత్‌కు కుడి కాలుకు తీవ్రమైన గాయం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళపై దాడి

కౌడిపల్లి(నర్సాపూర్): వివాహిత అదృశ్యమై తిరిగి రావడంతో భర్త తరపు బంధువులు, తండావాసులు దాడి చేశారు. వివరాలు ఇలా... మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత, మరో వ్యక్తితో కలిసి అదృశ్యమైంది. దీంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫోన్‌నంబర్ ఆధారంగా మహిళ ఆచూకీని కనిపెట్టి శుక్రవారం సాయంత్రం కౌడిపల్లికి తీసుకొచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న తండావాసులు ఆమెపై దాడి చేశారు. గమనించిన పోలీసులు వారిని చెదరగొట్టి మహిళను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహిళను తల్లిదండ్రులకు అప్పగించడం, లేదా సఖీ కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేయనున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగలు రిమాండ్

పటాన్‌చెరు టౌన్: మొబైల్‌ను తస్కరించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైమ్ సీఐ రాజు వివరాల ప్రకారం... పటాన్‌చెరు శివారు ఓఆర్ఆర్ సమీపంలో సింఫనీ కాలనీలో ఉంటున్న ఓ ప్రైవేటు ఉద్యోగి మొబైల్ రెండు రోజుల క్రితం అపహరించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం టోల్‌గేట్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఆటోలో కనిపించారు. దీంతో హైదరాబాద్ హనుమాన్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ వినోద్, అతని స్నేహితుడు రాకేశ్‌ని అదుపులోకి తీసుకుని విచారించగా మొబైల్ చోరీ తామే చేసినట్లు విచారణలో ఒప్పుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మొబైల్, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

మెడికల్ మాయ!

యథేచ్ఛగా శాంపిల్స్ మందుల అమ్మకాలు

- నిరక్ష్యరాస్యులకు అంటగడుతున్న వైనం
- ఫార్మసిస్టుల పేరుతో దుకాణాలకు అనుమతులు
- పట్టించుకోని అధికారులు

మెడికల్ దుకాణాల నిర్వాహకులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో పలు కంపెనీ శాంపిల్స్ మందుల విక్రయంతో పాటు జనరిక్‌ను అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజల జేబులు గుల్ల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రగ్ కంట్రోల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

–తూప్రాన్

నిబంధనల ప్రకారం మందుల దుకాణం పెట్టుకునేందుకు ఫార్మసీ కోర్సులు చదివిన వారు అర్హులు. అయితే జిల్లాలోని మెడికల్ షాపుల్లో చాలా వరకు ఈ కోర్సు పూర్తి చేసిన వారు కనిపించరు. ఎవరో ఒకరి వద్ద ఫార్మసీ సర్టిఫికెట్ అద్దెకు తీసుకుని దుకాణాలు నడుపుతున్నారు. జిల్లాలో 560 మెడికల్ షాపులు, 47 ఏజెన్సీలు కొనసాగుతున్నాయి. అనుమతులు లేకుండా మందులు విక్రయించేవారు వందల్లో ఉంటారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శాంపిల్స్‌ను విక్రయిస్తూ..

వివిధ మందుల కంపెనీలు తమ ఉత్పత్తుల అమ్మకాలు పెంచుకునేందుకు వైద్యులకు శాంపిల్స్‌ను అందిస్తాయి. వీటిని విక్రయించకూడదు. వాటిపై 'నాట్ ఫర్ సేల్' అని ముద్రించి ఉంటుంది. ఈ క్రమంలో ఆర్ఎంపీ వైద్యుల వద్ద శాంపిళ్ల మందులు అధికంగా ఉంటున్నాయి. వీరు రోగులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. కాగా ఈ శాంపిల్స్ మందుల దుకాణాల్లో కూడా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ఈ మందులను నిరక్ష్యరాస్యులకు విక్రయిస్తున్నారు. ఈ తతంగం అంతా ఆస్పత్రుల పరిధిలో ఉన్న మెడికల్ షాపుల్లో ఎక్కువగా సాగుతున్నట్లు సమాచారం.



పెరుగుతున్న ఏజెన్సీలు

మెదక్ జిల్లా హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉండటంతో ఇటీవల మెడికల్ ఏజెన్సీలు పెద్ద సంఖ్యలో పెరిగిపోతున్నాయి. జిల్లాలో 47 ఏజెన్సీలు, 560 మెడికల్ దుకాణాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి జిల్లాల్లోని ఆయా ప్రాంతాలకే కాకుండా కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. వీటిని సైతం నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాసులు కురిపిస్తున్న..

వివిధ కంపెనీలు తయారు చేస్తున్న జనరిక్ మందులు మెడికల్ షాపుల యజమానులకు కాసులు కురిపిస్తున్నాయి. ఈ మందులు తక్కువ ధరలకు లభిస్తాయి. అయితే ఆయా మందులపై ముద్రించి ఉన్న ధరకే అమ్ముతున్నారు. దీంతో రోగులపై తీవ్ర భారం పడుతోంది. వ్యాధుల బారిన పడిన వారు ఈ మందులు వాడితే జబ్బు నయం కాకపోవడంతో తిరిగి పలుమార్లు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో మరలా మందుల మార్చి వేరే మందులు అంటగడుతున్నారు. ఆస్పత్రుల వైద్యులకు మెడికల్ షాపుల నుంచి కమీషన్లు వెళుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోగికి కావాల్సిన మందులు లేకుంటే... వేరే కంపెనీ మందులను అంటగట్టుతున్నారు. లాభాలు ఎక్కువగా ఉండటంతో చాలా మంది ఇలాంటి మందులనే అమ్ముతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మెడికల్ షాపుల్లో శాంపిల్స్ అమ్ముతున్నట్లు తమకు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ పేర్కొన్నారు. లైసెన్స్‌లు తప్పకుండా నిర్వాహకుల పేరు మీదనే ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల జిల్లాలో ఐదుగురు ఆర్ఎంపీలపై కేసులు నమోదు చేశాం. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

–చంద్రకళ, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్, మెదక్

విలాసాల కోసం దారిదోపిడీ

చైన్‌స్నాచింగ్ కేసులో దంపతుల అరెస్ట్

టేక్మాల్(మెదక్): దారిదోపిడీ కేసులో పోలీసులు దంపతులను అరెస్ట్ చేశారు. శుక్రవారం అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచెపల్లి గ్రామానికి చెందిన లొద్ది రుక్మిణి ఈనెల 3న పెద్దశంకరంపేటలో ఉంటున్న తన కూతురు వద్దకు వెళ్లడానికి బస్టాప్‌లో బస్సు కోసం ఎదురుచూస్తుంది. ఒక ఆటో రాగా అందులో ఎక్కగా డ్రైవర్, ఒక మహిళ ఉన్నారు. వారు శంకరంపేటలో దింపుతామని నేరుగా టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి వైపు తీసుకెళ్తుండగా తాను గమనించి శంకరంపేటలో దింపాలని వారించింది. బొడ్మట్‌పల్లిలో హైస్కూల్ వద్దకు తీసుకెళ్లి ఆమె కళ్లలో స్ప్రే, ఇసుక చల్లి.. ఆమె మెడలో ఉన్న తులం చైన్‌ను తీసుకుని పరారయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా... సీసీ కెమెరాల సహాయంతో నిందితులను శుక్రవారం సంగారెడ్డిలో గుర్తించారు. ఎల్లారెడ్డి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన నిందితులు పూజారి శ్రీధర్, శిరీష దంపతులను అదుపులోకి తీసుకుని విచారించగా తమ అవసరాలు, విలాసాల కోసం చోరీ చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. బంగారు గొలుసును, నిందితులు వాడిన ఆటోను జప్తు చేశారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రాజేశ్, సిబ్బందిని సీఐ అభినందించారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి



అనాథలకు పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి హేమలత



మెదక్‌జోన్: మాట్లాడుతున్న కార్యదర్శి శుభవల్లి

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ముగ్దుంపూర్‌లోని బేతాని సంరక్షణ ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... వైకల్యం వారి శరీరానికే కానీ మనసుకు కాదన్నారు. మానసిక వికలాంగుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, అవమానించినా, ఇబ్బందులకు గురిచేసిన వారిపై చట్టరీత్యా శిక్షంచబడతారన్నారు. ఆశ్రమంలోని పలువురు అనాథలకు ఆధార్ కార్డులు లేక ప్రభుత్వం నుంచి అందాల్సిన పెన్షన్, ఇతర సదుపాయాలు అందడం లేదని ఆశ్రమ నిర్వాహకుడు సజీవ్ వర్గీస్ న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

భవితలో న్యాయ విజ్ఞాన సదస్సు

మెదక్‌జోన్: మెదక్ పట్టణంలోని భవిత కేంద్రంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి ఆర్ఎం శుభవల్లి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని.. దివ్యాంగులైన పిల్లల తల్లిదండ్రుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లాడ్స్ డిప్యూటీ చీఫ్ రామశర్మ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఉప్పలయ్య, సీడీపీఓ కరుణశీల, ప్యానల్ లాయర్ కరుణాకర్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను మించిన దైవం లేదు

- పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ
- హాజరైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దుబ్బాక: తల్లిదండ్రులను మించిన దైవం లేదని రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ పేర్కొన్నారు. నిరంతరం దైవనామస్మరణతోనే సర్వసుఖాలు చేకూరుతాయని తెలిపారు. పట్టణంలో గ్రామదేవత అయిన బొడ్రాయి (నాభిశిల, భూలక్ష్మీ అమ్మవారి) విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో శుక్రవారం సాయంత్రం మాధవానంద సరస్వతి స్వామిజీ పాల్గొని విగ్రహాలకు తదితర పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపదలో ఉన్న వారికి సాయం చేస్తే భగవంతుడికి చేసినట్లేనన్నారు. ఎవరికీ కూడా ఎట్టి పరిస్థితుల్లో హాని తలపెట్టవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కత్తి కార్తీకతో పాటు పలువురు ప్రముఖులు, వేదపండితులు, కులసంఘాల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతి స్వామీజీ

వెల్లివిరిసిన మత సామరస్యం

దుబ్బాక: బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో మత సామరస్యం వెల్లివిరిసింది. పట్టణంలోని ముస్లిం మత గురువుగా ప్రసిద్ధి గాంచిన బిస్మిల్లా హకీమ్ బాబా బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొనడంతో పాటు తన వంతుగా విరాళం అందించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. సోషల్ మీడియాలో సైతం వైరల్‌గా మారింది.

ఉద్యోగం ఇష్టం లేక యువకుడు ఆత్మహత్య

వివాహమైన నాలుగున్నర నెలలకే ఉసురు తీసుకున్న యువకుడు



విజయ్‌కుమార్

పాపన్నపేట(మెదక్): ప్రైవేట్ ఉద్యోగం చేయడం ఇష్టం లేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని పొడిచన్‌పల్లి తండా శివారులో శుక్రవారం వెలుగు చూసింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు... తండాకు చెందిన కెతావత్ విజయ్ కుమార్ (32)హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసి కొంపల్లిలోని ఓ హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. నాలుగున్నర నెలల క్రితం కొడిపల్లి మండలం బుజరంపేటకు చెందిన గీతతో వివాహం జరిగింది. అయితే పెళ్లి అనంతరం అతడు భార్యను ఇంటి వద్దే ఉంచి, తాను ఒక్కడే కొంపల్లిలో ఉంటున్నాడు. అత్తింటి వారు అక్కడ ఉద్యోగం మానేసి, స్థానికంగా ఉద్యోగం చేసుకుంటూ భార్యతో కలిసి ఉండాలని కోరారు. ఈ మేరకు కొడిపల్లిలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పనిని విజయ్‌కుమార్‌కు అప్పగించారు. కానీ ఇది ఇష్టం లేని అతడు గురువారం ఉదయం బయటకు వెళ్లి రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం ఏడుపాయలకు వెళ్లే దారిలో పొడిచన్‌పల్లి తండా అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ ఎంపికలు



ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న బాలికలు

మెదక్‌జోన్ : పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వెస్లీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి అండర్ -17 బాల బాలికలకు ఫుట్‌బాల్ ఎంపికలు జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి 145 మంది బాలబాలికలు ఎంపికల్లో పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 18 మంది బాలికలు, 18 బాలురను ఎంపిక చేసి నవంబర్ మొదటి వారంలో నల్లగొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు, పీడీలు శ్రీధర్ రెడ్డి, నగేశ్, శ్రీనివాసరావు, రూపేందర్, దేవేందర్ రెడ్డి, శేఖర్, దేవానంద్ పాల్గొన్నారు

యువకుడిపై పోక్సో కేసు నమోదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): బాలికపై వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఎస్ఐ కృష్ణారెడ్డి వివరాల ప్రకారం... జగదేవ్‌పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16)ను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు కొన్ని రోజులుగా ప్రేమించమని వెంటపడుతూ లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టి యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్: నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గయ్య వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన అనంత్ బారిక్ (20) బతుకుదెరువుకు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉంటూ.. సన్‌షైన్ డెవలపర్స్ బిల్డర్స్ వద్ద సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం నిర్మాణ దశలో ఉన్న ఐదో అంతస్తు వద్ద సెంట్రింగ్ పని చేస్తుండగా పైనుంచి పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతుడి బంధువు బిల్డర్ నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెరువులో పడి వ్యక్తి..

నిజాంపేట(మెదక్): చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మల్కా చెరువులో పడి మృతి చెందాడు. వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియలేదు. మృతుడు చామన చాయ రంగు ఉండి, నీలి రంగు ప్యాంట్, నలుపు రంగు డ్రాయర్ ధరించాడు. మృతుడి ఎడమ చేతిపై సూర్యుడు బొమ్మ పోలిన పచ్చబొట్టు ఉంది.

బోనాల శివారులో..

చేగుంట(తూప్రాన్): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... మండల కేంద్రం శివారులోని పెట్రోల్ బంకు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలంలో మృతుడి గురించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు..

మిరుదొడ్డి(దుబ్బాక): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ హరీశ్ కథనం ప్రకారం... భూంపల్లి గ్రామానికి చెందిన బొల్లి రాజు (29) పని లేకుండా ఆవారాగా తిరుగుతుండేవాడు. మద్యం తాగడానికి డబ్బులు కావాలని కుటుంబ సభ్యులను వేధిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో డబ్బులు ఇవ్వకుండా కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో ఈ నెల 6న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య కీర్తన, ఒక కుమారుడు ఉన్నాడు.

గంజాయి అమ్ముతున్న ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

మద్దూరు(హుస్నాబాద్): గంజాయి తాగడమే కాకుండా అమ్మడానికి యత్నిస్తున్న ముగ్గురు యువకులపై కేసు నమోదైంది. చేర్యాల సీఐ శ్రీను శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా నర్మెట్ట మండలం అమ్మాపూర్ గ్రామానికి చెందిన పండ్ల ప్రణయ్, వడ్లకొండ గ్రామానికి చెందిన గడ్డం పువన్, మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన మహ్మద్ సోహెల్ ఉప్పరౌనిడ్ల సమీపంలో గంజాయి తాగుతున్నారనే సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు కలిసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద 123 గ్రాముల గంజాయి, 2ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



లక్ష్మణ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆటో డ్రైవర్ అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటకకు చెందిన లక్ష్మణ్ కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులతో కలిసి తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి లక్ష్మణ్ అతని భార్యతో జీవనోపాధి కోసం బెంగళూర్ పోదామని చెప్పాడు. ఆ విషయంపై ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో గురువారం ఉదయం లక్ష్మణ్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు.

కుకునూరుపల్లిలో యువకుడు..



రఘు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన చిన్నరాజిగాని రాజయ్యకు ముగ్గురు కుమారులున్నారు. మొదటి కుమారుడు రఘు(23) వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 7న ఇంట్లో నుంచి వెళ్లి శుక్రవారం వరకు ఇంటికి రాలేదు. దీంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అలిసి.. కునుకు తీసి

ఓవైపు వర్షాలు పడుతున్నాయి.. మరోవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలపై దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే వాహనదారులు ఉక్కపోత భరించలేక అలిసి పోతున్నారు. ఈ క్రమంలో ఎక్కడ నీడ కనిపిస్తే అక్కడ సేద తీరుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే జాతీయ రహదారిపై ఓ వ్యక్తి బైక్‌పై కునుకు తీస్తూ కనిపించాడు. భారీ వాహనాల శబ్దం వినిపిస్తున్నా కూడా ఆదమరిచి అలాగే నిద్రపోయాడు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

తుల్జాభవానీ ఆలయంలో చోరీ

- ఆభరణాలు, హుండీల అపహరణ
- ఆనవాళ్లు సేకరించిన క్లూస్‌టీం

జహీరాబాద్: ఆలయంలో దొంగలు పడి హుండీలు పగులగొట్టి నగదు, ఆభరణాలను దొంగిలించారు. గ్రామస్తుల కథనం ప్రకారం... మొగుడంపల్లి మండలంలోని ఖాంజమాల్‌పూర్ గ్రామంలో గల శివాజీ మహారాజ్ నిర్మించిన తుల్జాభవానీ మాత ఆలయంలో ఆరు నెలల క్రితం మూడు హుండీలను ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల జాతర సందర్భంగా భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, కానుకలు హుండీల్లో వేశారు. హుండీల్లోని డబ్బులు లెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలోనే ఈ చోరీ జరిగింది. గర్భగుడిలో, ఆలయ ప్రాంగణంలో ఉన్న రెండు హుండీలను దొంగలు గురువారం రాత్రి ఎత్తుకెళ్లి ఆలయం సమీపంలో పగులగొట్టి నగదు, కానుకలను తస్కరించారు. ఆలయంలోని అమ్మవారి విగ్రహంపై ఉన్న వెండి కిరీటం, ముఖం, పాదాలతో పాటు శఠగోపం ఎత్తుకెళ్లారు. ఆలయంలోని నంది విగ్రహం వద్ద ఉన్న హుండీని మాత్రం దొంగలు ఎత్తుకెళ్లలేక పోయారు. కాగా ఆ హుండీని పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తుల సమక్షంలో తెరిపించి లెక్కించగా 3.80లక్షలు సమకూరింది. దొంగతనానికి సంబంధించిన సమాచారం అందుకున్న సీఐ శివలింగం, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి ఆలయా న్ని సందర్శించి పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న సీసీ కెమెరాలు ఇటీవల ధ్వంసమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



దొంగలు పగులగొట్టిన హుండీ



వివరాలు తెలుసుకుంటున్న సీఐ శివలింగం